



సూర్రావుపేటకల్లా పెద్దవర్తకుడు.

సూరిబాబు పనిమీద పట్నంవచ్చి పదిరోజులయింది. ఎంత త్వరగా తెముల్చుకుందామన్నా పని తెమిలింది కాదు. సూరిబాబుది ఉడుంపట్టు. అనుకున్న పని అయ్యేదాకా నిద్రపోయేరకం కాదు. సూరిబాబు వచ్చింది సేట్ శంకర్‌లాల్‌తో పనివుండి. సేట్ శంకర్‌లాల్ పదిహేనురోజుల క్రితమే బొంబాయివెళ్ళి అక్కడ్నించి ఇవాళ వస్తాను, రేపు వస్తాను అంటూ ఫోన్లు చేస్తున్నాడు. అందువలన ఇదుగో వస్తాడు అదుగో వస్తాడు అనుకుంటూ ఇన్నాళ్లు ఉండి పోయేడు సూరిబాబు.

ఉన్నకొద్దీ 'హోటల్ ఛార్జీలు' తెగ పెరిగిపోతున్నందుకు చికాకుపడిపోయాడు సూరిబాబు. శంకర్‌లాలునీ, అతని తాత ముత్తాతలనీ తెగతిట్టుకున్నాడు. అయినా తప్పేదిలేక అలాగ నిరీక్షిస్తూ వుండిపోయేడు. ఈలోగా ఇంటి మీదికి గాలిమళ్ళి సంగతి సందర్భాలు వివరిస్తూ యింటికి ఉత్తరాలు రాసేడు సూరిబాబు.

సూర్రావుపేట చిన్నసైజుబస్తీ. ఆ వూళ్లో నాలుగురకాల వ్యాపారాలూ పెట్టి నాలుగింటిమీదా నల్గురు కొడుకుల్నీ పెట్టి తను పైనుంచి చూసుకుంటూ వస్తున్నాడు సూరిబాబు. కొడుకులందరికీ పెళ్ళిళ్ళయాయి. కొడుకుల దగ్గరగానీ, కోడళ్ళ దగ్గరగాని సూరిబాబు మాట సుగ్రీవాజ్ఞ! ఇంకా పనిగాలేదనీ అంతా జాగర్తగా చూసుకోమనీ సూరిబాబు రాసిన వుత్తరానికి అతని పెద్దకొడుకు తండ్రిని తొందరగా రావల్సిందని, అంతా బాగానే వుందని జవాబు రాసేడు.

అయితే రెండు రోజుల్నుంచి సూరిబాబునో పీడ పట్టుకుంది. ఔను సరిగా రెండుదినాల క్రిందట సూరిబాబు సుల్తాన్ బజారునుంచి నడిచివస్తూవుంటే అతని వెనకాలనే ఇద్దరు కుర్రాళ్ళు పడ్డారు! సుల్తాన్ బజారునించి కోఠిదాకా మరల అక్కడనుంచి ఆబిడ్సువరకూ వాళ్ళు తననే చూస్తూ తనగురించే ఏదో చెప్పుకుంటూ 'ఫాలో' అవటం గమనించాడు. సూరిబాబు. బాగా బలిసిన దున్నపోతుల్లాంటి వాళ్ళిద్దరూ జమాజట్టీల్లాగ వున్నారు. హిప్పీస్టైలు జుట్టూ, కళ్ళజోళ్ళూ, బెల్‌బాటమ్ పంట్లాములూ—వూ తెగ సిగరెట్లు వూదేసారు. 'ఎవర్రా వీళ్లు నా వెనకాల పడ్డారు!!' అనుకుని కంగారుపడి ఆబిడ్సులో ఓ షాపులో దూరేడు సూరిబాబు. అతని వెనుకనే వాళ్ళూ లోపలికి వచ్చేరు! ఓరి వీళ్ళ దుంపతెగ అనుకుంటూ గబగబ ఆ షాపునుంచి బయటపడి రిక్షా ఎక్కి నాంపల్లి స్టేషనుకి వెళ్ళేడు సూరిబాబు, పని ఏమీ లేకపోయినా. స్టేషన్లో అటు ఇటు కాసేపు తిరిగి బయటికివచ్చి చూసేడు గదా వాళ్ళిద్దరూ అక్కడే వున్నారు! సూరిబాబుని చూసి నవ్వుకుంటున్నారు. గుండెల్లో మొదలయిన అదిరిపాటుని అణచుకుంటు సూరిబాబు సైకిల్‌టాక్సీ ఎక్కి హోటల్లోకి వచ్చిపడ్డాడు. అతని

చొక్కా తడిసిపోయింది. ఫ్యానుక్రింద అరగంటసేపు కూర్చుంటేగాని చమట ఆరలేదు.

హోటల్‌బాయ్‌ని పిల్చి కాఫీ తెప్పించుకుని తాగేకగాని ఆ కంగారు తగ్గలేదు సూరిబాబుకి. స్నానంచేసాక, భోజనాని కెళ్ళబోతూ ఏదో అనుమానంలాంటిది వచ్చి తలుపుతీసి తొంగిచూసేడు సూరిబాబు. 'వాళ్ళిద్దరూ' కారిడార్‌లో తారట్లాడుతున్నారు!

సూరిబాబు గుండె గుభేలుమంది!

అతని కాళ్ళు గజగజ వణికాయి ! !

ఏమాత్రమూ సందేహంలేదు. వాళ్ళు పెద్ద 'ప్లాను' మీదే వచ్చి తనని వెంటాడుతున్నారు. తనకోసమే వెదుకుతున్నారు. వాళ్ళ ప్లాను ఏమయివుంటుంది? తన దగ్గర డబ్బు వున్నట్టు వీళ్ళకి తెల్సిపోయివుంటుంది. అందుకనే పిశాచాల్లాగ తన వెనకపడ్డారు. వదిలిపెట్టే రకాల్లాగ కూడా లేరు.

గబగబా రూంకి తాళంవేసి డైనింగ్ హాలులోకి దూరబడ్డాడు సూరిబాబు. సూరిబాబు వెనకే వాళ్ళిద్దరూ కూడా డైనింగ్ హాలులోకి దూరబడి దూరంగా కూర్చుని సూరిబాబునే చూస్తూ మాట్లాడుకుంటున్నారు. సూరిబాబుకి ముళ్ళమీద కూర్చున్నట్లనిపించింది. వళ్ళు తెగ మండుకుపోయింది.

సందేహంలేదు.

వాళ్ళిద్దరూ పెద్ద దోపిడీగాళ్ళయి వుంటారు. అంతర్రాష్ట్రీయ దొంగల ముఠావాళ్ళయి వుంటారు! ఏమీ లేకుండానే వీళ్ళు ఇలాగ తన వెనకాల పడరు అని సూరిబాబు అనుకునే అంతలోనే వాళ్ళలో ఒకడు లేచి సూరిబాబు దగ్గర కొచ్చి ఎదురుగా కూర్చున్నాడు. లోలోపలి భయాన్ని అణచుకుంటూ మేకపోతు లాగ గంభీరంగా తలవంచుకుని గబగబ తినటం మొదలుపెట్టాడు, సూరిబాబు.

వాడుఅడగనేఅడిగాడు, "మందేవూరు సార్?" అని.

"ఏం ?" అన్నాడు సూరిబాబు కోపంగా. ఆ వెంటనే భయమూ కలిగింది.

"ఏంలేదు సార్. ఎక్కడో చూసినట్లుంటేనూ?"

"నువ్వు నన్నూ చూడలేదు. నేను నిన్నూ చూడలేదు" అన్నాడు కోపంగా సూరిబాబు.

"మీది సూర్రావుపేట. మీ పేరు సూరిబాబు. ఇంటిపేరు అప్పలకొండ. మీరు ఈ హోటల్లో రూం నంబరు 211 లో వుంటున్నారు.'' అన్నాడు. వాడు వదిలిపెట్టకుండా నవ్వులు వెదజల్లుతూ, అదోకలాగ చూస్తూ. కంపరమెత్తింది సూరిబాబుకి.

"అమ్మ నీ అమ్మ కడుపుమాడ ! ఇవరాలన్నీ కూపీలాగేవన్నమాట! ఎవడ్రా నువ్వు? అసలు నాకు నీకు ఏంటి సంబంధం? ఇవన్నీ నీకెందుకు?'' అనుకుని బెంబేలుపడి తెల్లమొహంవేసి, ''నీకెట్టాతెల్సు?'' అన్నాడు సూరిబాబు.

''తెల్సుకోవాలని వుంటే తెల్సుకోవచ్చు సార్. ఏం పనిమీద వచ్చారు మీరు'' అని అడిగాడు వాడు. అడిగి "చాల రోజులుగా ఇక్కడే మకాంపెట్టినట్లున్నారు'' అంటూ నససాగించాడు. గబగబ భోజనం ముగించి, చేతులు కడుక్కుని చరచరా ఇవతలికి వచ్చాడు సూరిబాబు, వాడ్ని అలాగే వదిలిపెట్టి. వెనక్కి తిరిగయినా చూళ్ళేదు.

ఆ రాత్రి సూరిబాబుకి సరిగ్గా నిద్ర పట్టలేదు.

పేపరు తీసిచూస్తే — దాన్నిండా హత్యలు, వాటి వివరాలు.

డబ్బుకోసం దేశమంతటా ఒకడ్ని మరోడు చంపటాలు. వెంటనే శంకర్‌లాల్ ఇంటికి ఫోనుచేశాడు సూరిబాబు. ఎవరో ఫారిన్ నుంచి వస్తున్నారని వాళ్ళని కలిసిగాని హైదరాబాదు రాననీ రెండురోజులు పడ్తుందనీ ఫోన్ చేసాడట శంకర్‌లాల్ ఆ సాయంత్రమే!

శంకర్‌లాల్‌ని తెగ తిట్టుకుని మరల పేపరు తీశాడు సూరిబాబు. దొంగలు-దొంగతనాలు గురించి బాక్సు కట్టి వేశాడు పేపరువాడు. మనుషుల ఆనుపానులు తెల్సుకుంటారట ముందు. వాడి వెనకాల గల బలాన్ని అంచనా వేస్తారట తర్వాత. దాన్నిబట్టి ప్లాను వేస్తారట. ఏ కారణంవల్లనయినా ఇవతలివాడు అలివికానప్పుడు వాడి అసలు వూరికివెళ్ళి వాడి పేరుచెప్పి తమపని చక్కపెట్టుకుంటారట. అందుకోసం ఎన్నోరకాల ఎత్తులు వేస్తారట. ఈ మధ్యన సినిమాలు చూసి దొంగలు రకరకాలుగా వేషాలు వేస్తున్నారట. పెద్దమనుషులుగా, స్టూడెంట్సుగా అవసరాన్నిబట్టి వేషాలు వేస్తున్నారట! హత్యకి కూడ వెనకాడరట! ఇదంతా చదివేసరికి తెగ చిరాకువేసింది సూరిబాబుకి. ఎంతో దిగాలుపడ్డాడు. ఈ శనిగాళ్ళు తన వెనకాల్నే పడాలా? అమ్మో! ఆవులిస్తే ప్రేగులు లెక్కపెట్టగల సమర్థులు వాళ్ళు. తెలిటంలా?

అప్పటికప్పుడు సూర్రావుపేటకి ట్రంక్‌కాల్ చేశాడు సూరిబాబు. ఇలాగ తనని ఇద్దరు దొంగలు వెంటాడుతున్న సంగతీ, ఈ రకమయిన క్రొత్త దొంగతనాల సంగతీ అంతా చెప్పి తను రెండు మూడు రోజుల్లో వస్తాననీ ఈ లోగా తన పేరు చెప్పి ఎవరు వచ్చి ఏం చెప్పినా నమ్మవద్దనీ, జాగ్రత్తగా వుండమనీ, రాత్రిళ్ళు ఎవరొచ్చి పిల్చినా అసలు తలుపు తీయవద్దనీ ఒకవేళ వాళ్ళు టాక్సీవేసుకుని వచ్చి కత్తులు కటార్లు చూపించి ఏమయినా చేసే ప్రమాదం వుందనీ అందువలన తగు జాగర్తలో వుండమనీ మరీ మరీ చెప్పాడు సూరిబాబు.




అంతా విని సూరిబాబు పెద్దకొడుకు కంగారుపడి ''నువ్వు తొందరగా వచ్చెయ్యి నాన్నా. మా కందరికీ ఏదో భయంగా వుంది. మనవూళ్లో దొంగలు తిరుగుతున్నారని అనుకుంటున్నారనలే' అని గోలపెట్టాడు. 'సర్లె సర్లె' అని కొడుకుని ఓదార్చాడు గాని తన భయాన్నైతే నిలవరించుకో లేకపోయాడు సూరిబాబు.

ఆ తెల్లవారుఝామున కలతనిద్రలో సూరిబాబుకి కొన్ని కలలు వచ్చేయి. వాళ్ళిద్దరూ తన రూం తలుపు బ్రద్దలు కొట్టి లోపలికివచ్చి గుండెలమీద కత్తి పెట్టి బెదిరించి దోచుకుపోయినట్టూ—

టాక్సీ వేసుకుని సూర్రావుపేట వెళ్ళి తన గొంతుపెట్టి పిల్చి తలుపులు తెరిచాక తన కొడుకుల్ని బెదిరించి అంతా దోచుకుని టాక్సీలో పారిపోయినట్టూ తన భార్యా కొడుకులు ఏడుస్తూ ఎదురు వచ్చినట్టూ—

ఉలికిపడి లేచేడు సూరిబాబు. ఇక నిద్రపట్టనేలేదు.

గబగబ స్నానం ముగించేసరికి తెల్లవారింది. ఎర్రబడిన కళ్ళతో వెంటనే శంకర్‌లాల్ ఇంటికి ఫోనుచేసేడు సూరిబాబు. ఆ తెల్లవారుఝామున మరల ట్రంక్‌కాల్ వచ్చిందట బొంబాయి నుంచి. ఆ ఫారిన్‌వాళ్ళ ట్రిప్పు 'పోస్టుపోను' అయినందువలన తను మిగతా పనులు చూసుకొని ఆ సాయంత్రానికి వచ్చేస్తూన్నట్లు శంకర్‌లాల్ ఫోను చేసేడట!

'పోన్లే, ఇన్నాళ్ళు వున్నందుకూ, పడిగాపులు కాసినందుకూ ఇదీ గుడ్డిలో మెల్లగా కల్సివచ్చిందనుకొని, సంతృప్తి పడి కాఫీ సెక్షనులోకి ప్రవేశించేడు సూరిబాబు.

ఎదురుగా వాళ్ళిద్దరూ! మిడిగుడ్లువేసి వురిమిచూస్తూ — రాస్కెల్సు! ఏదో చెప్పుకుని నవ్వుకుంటున్నవాళ్ళల్లా, తనని చూసి మాటలాపేసి గుసగుసలాడారు.

సూరిబాబుకి గుండెల్లో రైళ్ళు పరుగెత్తేయి !

సందేహంలేదు.

వాళ్ళు తనని ఏదో చెయ్యటానికి కుట్రపన్నుతున్నా రన్నది ఖాయం. వీలయినంత త్వరగా ఈ పీడ వదుల్చుకుని సూర్రావుపేట వెళ్ళి వాలితే బాగుండుననిపించింది. పీడ !

అంతలో వాళ్ళిద్దరూ లేచి అటుగా వచ్చారు.

వాళ్ళల్లో ఒకడు స్టైలుగా, తల పైకి పెట్టి పొగరుగా నడిచాడు. వాడి బొడ్డు దగ్గర బెల్టుకింద లావుగా వున్నట్టు కన్పించింది. అందులో చాకులు కత్తులు వంటివి ఏవయినా వుండొచ్చు నన్పించింది సూరిబాబుకి.

సూరిబాబును ఆ రెండోవాడు ఓరగా చూసి వొంకరనవ్వు నవ్వి 'నమస్కారం సార్" అని అన్నాడు.




ఇక సందేహం లేదు.

ఈ ముండాకొడుకులు దొంగనమస్కారాల దాకా వచ్చారు. ఇంక-ఏ రాత్రో చొరబడి తనని తిరుక్షవరం చెయ్యటమే వాళ్ళిద్దరి ఆలోచన అయివుంటుందన్నది ఖాయం, అనుకుని గుర్రుగా చూసాడు సూరిబాబు.

కాషియర్ దగ్గరకి వెళ్ళాక వాళ్ళిద్దరూ అక్కడే నిలబడి తననే చూస్తూ గలగల మాట్లాడ్తూ వుండిపోయారు కాసేపు.

ఇక లాభంలేదు సరిగదా పరమ ప్రమాదంలాగ వుంది.

ఈ వూళ్ళో ఇక ఒక నిముషం వుండకూడదు అనిపించినా, వెంటనే శంకర్ లాల్ ని కలిసి వ్యవహారం మాట్లాడి అతన్తో కొత్త బిజినెస్ గురించి అగ్రిమెంట్ ని కుదుర్చుకోవాల్సిన సంగతి జ్ఞాపకం వచ్చి ఆ ఆలోచన నీరుగారి పోయింది. లేకపోతే ఆ ఛాన్సు మరెవరయినా తన్నుకుపోయే ప్రమాదముంది.

పళ్ళు బిగపట్టి ఆ సాయంత్రంవరకు వుండిపోయేడు సూరిబాబు.

కాని ఈలోగా బషీర్ బాగ్ దగ్గరగా, నారాయణగూడ సెంటర్లోను వాళ్ళిద్దరూ దర్శనమిచ్చి సూరిబాబు బ్లడ్ ప్రెషర్ ని పెంచారు. వాళ్ళ మొహాలు క్రోధంతోను, కళ్ళు ఎర్రగాను వుండటమూ గమనించాడు సూరిబాబు.

ఏది ఏమయినా వెంటనే ఈ పీడని వదల్చుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం అనిపించింది. మనసు స్తిమితం కోలుపోయింది.

ఆ మధ్యాహ్నానికి దిగాడు శంకర్ లాలు. అమ్మయ్య. నరకయాతనకి గురయినా - చివరికి అనుకున్నట్లుగా పని జరిగిపోయింది! అనుకున్నట్లుగా అన్నీ జరిగితే సంవత్సరానికి అరలక్ష దాకా లాభాలు! ఎంతో సంతృప్తితో టాక్సీ వేసుకుని స్టేషనుకి వెళ్ళాడు సూరిబాబు.

ప్లాట్ ఫారంమీద వాళ్ళు! తన కోసమే ఎదురుచూస్తున్నట్లు వాళ్ళ మొహాలు! ట్రయిన్లలో హత్యలు గురించి పేపరులో తను చదివింది గుర్తువచ్చింది.

ఏమయితే అయిందని గిర్రున వెనుదిరిగి ఆఘమేఘాలమీద బయటపడి ఇవతలికి వచ్చి-వెంటనే టాక్సీ మాట్లాడుకుని ఎక్కాడు. గుండెల్లో ఏదో అయింది. అనుకోకుండానే వెనుదిరిగి చూసాడు. బయటికివచ్చి స్టేషన్ వెలుపల నిలబడి వాళ్ళు తననే చూస్తున్నారు! —గుండెలుతీసిన బంటుల్లాగ నవ్వుతున్నారు!!! వెంటపడేట్టున్నారు. సూరిబాబుకి కంగారెత్తింది. టాక్సీవాడికి రెండొందలుపోసి, మధ్యలో అది ట్రబులిచ్చి ఆగిపోగా అదీ 'వాళ్ళ ప్లానే' కాదుగదా అనుకుని కంగారెత్తి చచ్చి బ్రతికి రాత్రి ఒంటిగంటకి సూర్రావుపేట చేరాడు సూరిబాబు. చలికాలం. సూరిబాబుని దింపి టాక్సీవాడు వెళ్ళిపోయేడు. చలికి గజగజ వణుకుతూ వీధిగోడదాటి మెట్లెక్కి- తన ఇంటి తలుపుతట్టి పిలిచి 'నేనురా, మీ బాబుని.

హైదరాబాదునించి టాక్సీలో వచ్చాను. చలికి చచ్చిపోతున్నాను. తలుపు తీయరా' అంటే అరగంట తర్వాత నిద్రలేచినా పెద్దాడు తలుపు తీయడే!

''నువ్వు ఎవరైనాగానీ. తెల్లారేకగాని తలుపుతీయి. ఇంకా మాట్లాడేవంటే అరిచి నలుగుర్నీ పిలుస్తాను'' అన్నాడు గాని తలుపుతీయలేదు వాడు.

ఆ తెల్లార్లూ అలాగే చలిలో నానా బాధ పడినాక వెలుగు వచ్చాకగాని సూరిబాబుకి గృహప్రవేశం దొరకలేదు. ఫెళ్ళున జ్వరం వచ్చింది—నాలుగు రోజులకిగాని మరల మామూలు మనిషి కాలేదు సూరిబాబు.

పథ్యం పుచ్చుకున్న మర్నాడు అతనికో వుత్తరం వచ్చింది. రాంబాబు అని అతని చిన్ననాటి స్నేహితుడు—ప్రాణమిత్రుడు – రాసాడు. రాంబాబు డిప్టీకలెక్టరుగా వుద్యోగం చేస్తున్నాడు. అతనికి ఈ మధ్యనే హైదరాబాదు బదిలీ అయిందట– ఆవటాని – అంతా రాసి–

ఈ మధ్యన నువ్వు ఇక్కడికి వచ్చి వెళ్ళేవటగదా! మా కుర్రవాడు చెప్పాడు. నేను ఈ మధ్యన టూరు వెళ్ళి మొన్ననే వచ్చానులే.

అవునుగాని సూరీ! నువ్వు మావాడ్ని గుర్తుపట్టలేదా! మేము మీ పెద్దవాడి పెళ్ళికి వచ్చినప్పుడు వాడూ వచ్చాడుగా! వాడు నిన్ను అనుకోకుండా కలిసాడట! వాడిప్పుడు ఎం.ఏ. ఏడుస్తున్నాడులే. ఫ్రెండొకడు వచ్చి హోటల్లో దిగితే ఆ నాలుగురోజులూ వాడూ అక్కడే మకాం వేసాడట! వాళ్ళిద్దరూ సర్దాగా వూరంతా తిరిగారట.

అవునూ మా వాడు గుర్తుపట్టి పలకరించితే కసిరికొట్టావట! అంతా నా మీద కోపమే? ! అయినా వాడిమీదెందుకురా చూపటం?! త్వరలో కలుస్తాలే – అని ముగించాడు రాంబాబు.

సూరిబాబు కాసేపు అప్రతిభుడయాడు!

ఆ వెంటనే పెద్దపెట్టున నవ్వాడు. గుండెలమీద పెద్ద గుబులు తొలగినట్లు, బరువు దిగినట్టు 'గభాల్న మంచందిగి ఇంట్లోనే ఆటు ఇటు చకచకా నడిచాడు

